

# తల్లి భూదేవి

పల్లూరు శివప్రసాద్

ఆ ఉత్తరం శ్రీనివాస్‌ని ఆనందాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బు చేసింది. అది పదేపదే చదివాడు. దేన్నయినా ఒక సవాలుగా తీసుకొని సాధించగలగటమంటే సామాన్యమైన విషయం కాదు. ప్రాణాలకు సైతం తెగించి సాధించిన ఒక గొప్ప విజయం, పదిమంది దృష్టిలో ఘనకార్యం కాకుండా వుంటుందా?

ఆ ఉత్తరంలో రామ్‌నాథ్ గోయెంకా ఫౌండేషన్ వారి ప్రతిష్ఠాత్మక అవార్డును శ్రీనివాస్‌కు ప్రకటిస్తున్నట్లు వర్తమానం వుంది. ఇలాంటి అవార్డులు శ్రీనివాస్‌కు కొత్త కాదు. బ్రిటన్‌లోని 'ది రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ' వారి పురస్కారం, 'ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ సింగపూర్' వారి పురస్కారంతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్న ప్రతిభావంతుడు. చీకటి వెలుగులు, నలుపు తెలుపుల కలనేతలోని సౌందర్యాన్ని తన కెమెరాలో బంధించి అద్భుతమైన ఛాయా చిత్రాలుగా మలిచి ఫొటో జర్నలిస్ట్‌గా గొప్ప గుర్తింపును, గౌరవ పురస్కారాలను పొందిన యువకుడు. ఉత్తమ ఫొటో జర్నలిస్టుగా 'ఇండియాప్రెస్ ఫొటో అవార్డు'ను అందుకోగలగడమంటే ఆ రంగంలో ఒక ఉన్నతమైన స్థానాన్ని అందుకోగలిగినట్లే. అది కేవలం నైపుణ్యానికి ఇచ్చే అవార్డు కాదు. దాంతో పాటు సాహసం, గతంలో ఎవరూ స్పృశించని అంశమై వుండాలి.

"మరీ అంత మూర్ఖత్వం పనికిరాదు. మన ప్రాణాలకంటే ఏదీ గొప్పది కాదు. నా గురించి, పిల్లల గురించీ కాస్త ఆలోచించండి," కళ్లనీళ్ల పర్యంతమైంది భార్గవి.

శ్రీనివాస్ బోండా హిల్స్‌కు వెళ్లాలనుకోవటం ఆమెకు ఏ మాత్రం ఇష్టంలేదు.

"అసలు రిస్క్ అనేది లేకుండా జీవించటం ఎలా సాధ్యం? ప్రాణానికి ప్రమాదం ఎక్కడో మారుమూల అడవుల్లోనే కాదు, పట్నం నడివీధుల్లోనూ వుండొచ్చు," తేలిగ్గా నవ్వాడు.

"పులి నోట్లో తల దూర్చడం వివేకమనిపించుకుంటుందా?" ఎలాగైనా శ్రీనివాస్ వెళ్లకుండా చూడాలని భార్గవి ప్రయత్నం.

"భార్గవి! ఏ రంగమైనా కావచ్చు, మనదంటూ ఒక ప్రత్యేకతను ప్రదర్శించగలిగినప్పుడే ఆ రంగంలో మనకంటూ ఒక గుర్తింపు వస్తుంది. గొప్ప ఫలితం రాబట్టాలంటే గొప్ప ప్రయత్నం తప్పదుమరి," అనునయించే ప్రయత్నం చేశాడు.

శ్రీనివాస్ తొందరపడి ఏ నిర్ణయం తీసుకోడు. ఒక నిర్ణయమంటూ తీసుకున్నాక ఎవరేమన్నా వెనకడుగు వేసే ప్రసక్తి వుండదు. కాదని ఒప్పించటమంటే అతన్ని నొప్పించటమే అవుతుంది. భార్గవి అంతకన్నా అడ్డుచెప్పలేకపోయింది.

తనకు అవార్డు వచ్చిన విషయం ముందుగా భార్గవికి చెప్పాడు.

"హాయ్ కంగ్రాట్స్! ఐయామ్ వెరీవెరీ హ్యాపీ!" అంటూ పట్టుకొని కుదిపేసింది. కైరాపుట్ నుంచి క్షేమంగా తను తిరిగొచ్చినప్పుడు ఆమె కళ్లల్లో కనిపించిన ఆనందం మళ్లీ కనిపించింది. అవార్డు క్రింద ఐదులక్షలు నగదు బహుమతిగా ఇస్తారని చెప్తే పిల్లలు ఏం కొంటే బాగుంటుందో ఆలోచనలు చేస్తున్నారు.

పత్రికల్లో శ్రీనివాస్‌కు అవార్డు విషయం ప్రకటించటంతో గొప్ప ప్రచారం వచ్చింది. బంధుమిత్రులు అభినందనలతో ముంచెత్తారు. జిల్లా ఫొటోగ్రఫీ అసోసియేషన్ పెద్ద సన్మానం తలపెట్టునట్టు తెలియజేసింది. ఈ అభినందనలు, సత్కారాలు కంటే కొండకోనల్లో అనాగరికంగా బ్రతుకుతున్న బొండా గిరిజనుల జీవితాల్లో, చైతన్యంతో వెలుగు నింపాలన్నదే తన ధ్యేయం. అందుకోసం ఎంతటి రిస్క్ తీసుకోవటానికైనా సిద్ధపడ్డాడు.

"నో మిస్టర్ శ్రీనివాస్! ఇటీజ్ వెరీ వెరీ డేంజరస్ ఎఫర్ట్. బోండులు మిగతా గిరిజనుల్లాంటివాళ్లు కాదు. మొండితనం, మూర్ఖత్వం ఎక్కువ. కెమెరా వాళ్ల కంట పడితే నిలువునా ప్రాణాలు తీస్తారు. చట్టమంటే వాళ్లకు భయంలేదు," తన మనసులో మాట సంజయ్‌కు చెప్పినప్పుడు సీరియస్‌గా అన్నమాటలివి.

సంజయ్ గిరిజనుల వేషభాషలు, ఆచార వ్యవహారాలను బాగా ఆకళింపు జేసుకున్న వ్యక్తి. గుత్తికోయలలో గిరిజనుల పిల్లలకు చదువులు చెప్పే బడి నడుపు తున్నాడు. ఫొటోగ్రఫీ అతడి హాబీ. రెండేళ్ల క్రితం గుత్తికోయలలో ఫొటోలు తీసుకోవటానికి వెళ్లినప్పుడు తొలిగా పరిచయమైంది. మంచి మిత్రుడయ్యాడు.

గుత్తికోయల బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతం. అక్కడి గిరిజనులు స్పష్టమైన తెలుగు మాట్లాడగలరు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూనుకొని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. అందులో చిత్తశుద్ధితో పాలుపంచుకుంటున్నవాడు సంజయ్.

"ప్లీజ్ సంజయ్! ఆరునూరైనా సరే బోండుల జీవనశైలిని ఫొటో ఆల్బమ్ చేసి తీరాల్సిందే. ఆ ప్రయత్నంలో నా ప్రాణాలు పోయినా సరే!" దృఢ సంకల్పంతో మాట్లాడాడు శ్రీనివాస్.

అతడి మొండితనానికి ఆశ్చర్యపోయాడు సంజయ్. అనుకొన్న లక్ష్యాన్ని ఛేదించటానికి ప్రాణాలను తృణప్రాయంగా ఎంచే సాహసులు, ఈ లోకంలో ఒకరి తర్వాత మరొకరు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తూనే వుంటారు. లేకుంటే చరిత్రలో విజయాలు ఎలా నమోదవుతాయి? ఏ రకంగా తను శ్రీనివాస్‌కి సహాయపడగలడు? బాగా ఆలోచించిన మీదట ఒక ఆలోచన స్ఫురించింది.

"శ్రీనివాస్! నీకీ విషయంలో సహాయపడగలిగిన ఒకే ఒక వ్యక్తి భువనేశ్వర్‌లో వున్నాడు."

"ఎవరు?" శ్రీనివాస్‌కి ప్రాణం లేచొచ్చింది.

"పద్మశ్రీ సాహు! గిరిజనుల దృష్టిలో ఆయనో దేవుడు," సంజయ్ సాహు గురించి అనేక విషయాలు చెప్పాడు.

బోండా గిరిజనుల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన వ్యక్తి సాహు. బోండా గిరిజన డెవలప్‌మెంట్ ప్రాజక్టులో చిరుద్యోగిగా చేరిన సాహు చివరకు ఆ ప్రాజెక్టు డైరెక్టరయ్యాడు. గిరిజనులు ఆయన్ను ఎంతగానో అభిమానిస్తారు, ఆరాధిస్తారు. ఆయన మాటంటే వారికి వేదవాక్కు. ముప్ఫై యేండ్లకు పైగా గిరిజనులకు ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది. బోండా గిరిజనులకు నాగరిక జీవనం పట్ల అవగాహన కల్పించటానికి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దటానికి సాహు అనితరసాధ్యమైన కృషి చేశాడు.

శ్రీనివాస్ భువనేశ్వర్ వెళ్లి సాహుని కలిశాడు. ఫొటో జర్నలిస్టుగా తనను తాను పరిచయం చేసుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఎన్నో ఫొటోలు చూపించాడు. సంవత్సరాల తరబడి దేశవిదేశాలు తిరిగి తీసిన గిరిజనుల ఫొటో ఆల్బమ్‌లు చూపాడు. ముఖ్యంగా సౌత్ ఆఫ్రికాలో జూలు ట్రైబ్స్, కెన్యా, టాంజానియా ట్రైబ్స్, ఇండియాలో గోండులు తదితర గిరిజనులు, లంబాడీ తండాల ఫొటోలు చూసి, ఆ ఫొటోగ్రఫీ నైపుణ్యానికి పులకరించి శ్రీనివాస్‌ను అభినందనలతో ముంచెత్తాడు.

"సాహు సాబ్! మీ నుంచి నాకో ముఖ్య సహాయం కావాలి. బోండాల జీవిత విధానాన్ని ఫొటోగ్రఫీ చెయ్యటానికి మీరు సహాయపడగలరన్న ఆశ నన్నిక్కడిదాకా తీసుకొచ్చింది," మెల్లగా తన మనోగతాన్ని వెల్లడించాడు.

సాహు ఒక్కసారిగా గంభీరంగా మారిపోయాడు.

"ఇటీజ్ ఇంపాజిబుల్! అది ప్రాణాలతో చెలగాటం. వాళ్లను ఫొటోలు తియ్యటానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. మూడు దశాబ్దాల కాలం పైగానే వాళ్లతో కలిసి తిరిగాను, తిన్నాను, ఆడాను, పాడాను... బట్ వాళ్లతో కలిసి ఒక్క ఫొటో కూడా తీసుకునే ప్రయత్నం చెయ్యలేదు."

"ఫొటోలు తీసుకొంటే వచ్చే నష్టం ఏముంది?"

"దానివల్ల శక్తి హరించుకుపోతుందని, ఆయుస్సు క్షీణిస్తుందని ఎవరో బాగా నూరిపోశారు."

"అది నిజం కాదని మీరు ఎడ్యుకేట్ చెయ్యొచ్చుగా!"

''అంతకన్నా ముఖ్యమైన విషయాల మీద దృష్టి పెట్టాను. వాళ్ల ఆలోచనా ధోరణిలో, జీవితవిధానంలో మార్పు తీసుకురావటం అత్యవసరమనిపించింది.''

''ఇప్పుడు తలచుకున్నా మీరు కన్విన్స్ చెయ్య గలరన్న నమ్మకం వుంది.''

''సారీ! నమ్మకంగా చెప్పలేను. ఒక్కోసారి చాలా చిత్రంగా ప్రవర్తిస్తుంటారు. అతి చిన్న విషయం గురించి కూడా చాలా వైలెంట్‌గా రియాక్టవుతుంటారు. క్షణంలో సంతోషం, క్షణంలో కోపం. ఒక్కోసారి వాళ్లను చూసి నవ్వినా సహించరు. చచ్చేలా కొడతారు. నేను ప్రాజెక్టు లో చిరుద్యోగిగా చేరిన కొత్తలో వాళ్లంతా నగ్నంగానే వుండేవారు. దేహం మీద పూసలు తప్ప మరో ఆచ్ఛాదన వుండేది కాదు. మగవాళ్లతో గోచీలు పెట్టించడానికి, ఆడవాళ్లతో అడ్డపట్టలు పట్టించటానికి నాకు పాతి కేళ్లు పట్టింది! కొత్తను అంత త్వరగా ఆమోదించరు. ఒక్కో తెగవాళ్లు ఒక్కోరకమైన కట్టు బాట్లకు, జీవిత విధా నానికి అలవాటు పడి వుంటారు. యువకుడివి. ఎంతో భవిష్యత్తున్న వాడివి. కోరి చావును కొనితెచ్చుకోకు,'' తెగేసి మరీ చెప్పాడు సాహు.

సాహు మాటలకు నిరాశపడ్డాడు. అయినా లక్ష్యం సాధించటానికి తగిన ప్రయత్నాలు చేయటం మాత్రం మానలేదు. సంజయ్‌ను అంతటితో వదిలిపెట్ట లేదు. ప్రత్యామ్నాయం కోసం శోధించటం మొద లెట్టాడు.

సంజయ్ సలహా మీద సాహుకి గురుతుల్యుడైన జగదానందను కలిశాడు.

జగదానంద కూడా గిరిజన పక్షపాతి. గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే త్యాగమూర్తి. ఒక ఎన్.జి.ఓ. ఆర్గనైజేషన్ నెలకొల్పి, దేశవిదేశాల నుంచి విరాళాలు సేకరించి తీసుకొచ్చి లక్షలకు లక్షలు గిరిజన సంక్షేమం కోసం ఖర్చు పెట్టే నిస్వార్థపరుడాయన. ఐక్య రాజ్య సమితి సభ్యుడు కూడా. సాహుకి ఆయనంటే ఎంతో గౌరవం.

తనను తాను పరిచయం చేసుకొని, బోండాల జీవనశైలిని ఫొటోలు తియ్యాలన్న తన ఆకాంక్ష నెరవేర టానికి సహకరించాలని అభ్యర్థించాడు. ఆయనకు మనసులో సాహు స్ఫురించాడు. జగదానంద కబు రందుకొన్న మీదట సాహు ఉరుకుల పరుగుల మీదొ చ్చాడు. అక్కడ శ్రీనివాస్‌ను చూస్తూనే సాహు విషయం గ్రహించాడు.

''సాహు! ఈ కుర్రాడు బోండా గిరిజనుల ఫొటోలు తీసుకోవాలన్న ఉబలాటంతో ఇంత దూరం వచ్చాడు. నువ్వంటే వాళ్లు ప్రాణం పెడతారని నాకు తెలుసు. నువ్వతనికి సహకరించాలి. నీ సహకారంతో అనుకొన్నది సాధించగల ఓర్పూ, నేర్పూ ఇతగాడికున్నా యని నేను విశ్వసిస్తున్నాను.'' జగదానంద మాటల్ని సాహు శిరోధార్యంగా భావిస్తాడు. ఎలా కాదనగలడు?

పదిరోజుల తర్వాత సాహు నుండి ఫోనొచ్చింది, వెంటనే బయల్దేరి రమ్మని. శ్రీనివాస్ రాత్రికి రాత్రే దొరికిన ట్రైన్‌లో భువనేశ్వర్ బయల్దేరాడు.

''నీ పట్టుదల, అంకితభావం నన్నెంతో ఇంప్రెస్ చేశాయి. ఈ విషయంలో ఏమాత్రం తొందరపాటు పనికిరాదు. గతంలో బోండా గిరిజనుల్ని ఫొటోలు తియ్యడానికి ప్రయత్నించి పదిహేడుగురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. అందులో విదేశీయులూ ఉన్నారు. ఇక్కడ నీ లక్ష్యం ప్రమాదకరమైందని మర్చిపోకు,'' వాత్సల్యంగా భుజం తట్టాడు సాహు.

''థాంక్యూ సర్! మీ సూచనలు, సలహాలు తూచ తప్పకుండా పాటిస్తాను,'' వినయపూర్వకంగా చేతులు జోడించాడు.

''దట్స్‌గుడ్! బోండా హిల్స్ మీద వసతికి తగిన ఏర్పాట్లు చేయించాను. ముందు నువ్వు బోండాస్ అభి మానాన్ని, నమ్మకాన్ని పొందగలగాలి. ఇతను మా మనిషి అన్న విశ్వాసం కలిగించగలగాలి. అలా చెయ్య లేనప్పుడు ఒక్క అడుగు ముందుకు వెయ్యలేవు, గుర్తుంచుకో.'' శ్రీనివాస్ మౌనంగా తలూపాడు.

సూర్యోదయానికి ముందే బ్రేక్‌ఫాస్ట్ చేసి ప్రయాణం ప్రారంభించారిద్దరూ. చెరో బ్యాగ్‌లో కావ లసిన బట్టలు, తినుబండారాలు వగైరా సర్దుకున్నారు. ఆ లగేజి మోస్తూ కొండల మీదకి ఎక్కటం అంత సులు వైన పనేం కాదు.

''బోండా హిల్స్ చేరాలంటే సుమారు ఓ నలభై కిలోమీటర్లు నడవాల్సి వుంటుంది. ఇప్పుడంటే ఆ దూరం తక్కువనుకోవాలి. నేను బోండా ప్రాజెక్టులో ఉద్యోగిగా నియమించబడినప్పుడు మొదటిసారి వంద కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. కాలక్రమంగా ఏర్పడిన రోడ్డుమార్గం ఆ దూరాన్ని తగ్గించింది.'' కొండవాగుల్లో ప్రయాణానికి అలవాటుపడిన సాహుకి ఇదేమంత శ్రమనిపించకపోవచ్చు. కాని తన పరిస్థితి వేరను కున్నాడు శ్రీనివాస్.

బోండా గిరిజనుల జీవితాల్లో వెలుగు నింప టానికి ఆయన పడిన శ్రమ, చేసిన కృషి, త్యాగం బహు మతులకు అతీతమైందనుకున్నాడు శ్రీనివాస్. దారి పొడుగునా బొండాలతో తన అనుభవాన్ని, సాన్ని

హిత్యాన్ని కథలు కథలుగా చెప్పటం మొదలెట్టాడు సాహు. ఆ కథనాలు ఎంతో ఆసక్తిగా, విచిత్రంగా వున్నాయి. ఒక కొత్తలోకం గురించి మొదటిసారి తెలుసు కొంటున్నట్లనిపించిది శ్రీనివాస్‌కు. సముద్రపులోతుల్ని అందుకోలేనట్లే, మనిషి విజ్ఞానపు లోతుల్ని సైతం అందుకోలేడనిపించింది.

గంట ప్రయాణం సాగిందో లేదో, బోండా గిరి జనులు గుంపులు గుంపులుగా కొండదారిలో పరు గులు పెడ్తున్నట్లుగా క్రిందకు చకచకా దిగుతున్నారు. అందరి చేతుల్లో, తలల మీద రకరకాల వస్తువులు. పుల్లల చీపుళ్లు, నెమలిఫించాలు, తేనెపట్టులు, కాయ గూరలు, పండ్లు తీసుకొస్తున్నారు.

దారిలో ఎదురుపడుతున్న గిరిజనులు సాహుని చూస్తూనే, 'హొసన్నా,' అంటూ చేయెత్తి పలకరిస్తూ, గౌరవంగా ప్రక్కకు తొలిగి దారి యిస్తున్నారు. బోండుల భాషలో వారిని ఆత్మీయంగా పలకరిస్తూనే నడక సాగిస్తున్నాడు సాహు. ఆయనను ఎరగని మనిషంటూ ఆ కొండల్లో వుంటాడనిపించలేదు శ్రీనివాస్‌కి.

''హొసన్నా అంటే అర్థమేంటి సార్?'' అడిగాడు శ్రీనివాస్ పదేపదే గిరిజనుల నోట వినిపిస్తున్న ఆ పదం వింటూ.

''నవ్వుతూ వుండు. మనిషికి ఎన్ని కష్టాలెదురైనా అలా నవ్వుతూనే వుండాలని వాళ్ల భావం,'' చెప్పాడు సాహు.

ఎంత అర్థవంతమైన పలకరింపు! మనిషికి మనిషికి మధ్య ఇంతకన్నా విలువయిన సందేశమే ముంటుంది?

ఆ ప్రాంతంలో వారానికోరోజు సంత జరుగు తుంటుంది. గిరిజనులు అడవుల్లో సేకరించిన వస్తువులు, పండించిన కాయగూరలు సంతకు తెచ్చి అమ్ముతుంటారు. ఆ వచ్చిన డబ్బుతో వాళ్లు ముఖ్యంగా కొనేది ఉప్పు, ఆ తర్వాత రకరకాల పూసలు, కంఠా భరణాలు, వంటపాత్రలు. సూర్యోదయ సమయానికే వాళ్లు కొండ క్రిందికి వచ్చారంటే ఎంత రాత్రి బయల్దేరి వుండాలోననుకున్నాడు శ్రీనివాస్. పై నుంచి క్రిందకు అడ్డదారుల గుండా వాళ్లు ఆరేడు గంటల సమయంలో వస్తారని సాహు చెప్పేసరికి ఆశ్చర్యమనిపించింది. సంతలో సరుకులు అమ్ముకొని, కావల్సినవి కొనుక్కొని తిరిగి సూర్యాస్తమయ సమయానికి హిల్స్ మీదకు చేరుకుంటారంటే నమ్మశక్యంగాలేదు.

సాహు, శ్రీనివాస్‌లు బోండా హిల్స్ చేరుకునే సరికి సాయంత్రమైంది. దారిలో అక్కడక్కడ ఆగుతూ, విశ్రాంతి తీసుకుంటూ, కూడా తెచ్చుకున్నవి తింటూ పైకి చేరారు. మధ్యలో గిరిజనులు బ్యాగ్‌లు అందుకొని మోసుకురావడం గొప్ప సహాయమనిపించింది.

కొండమీద గిరిజన బాలుర వసతిగృహంలో మకాం ఏర్పాటుచేశాడు సాహు. గదిలోకి వెళ్లుతూనే నిస్సత్తువగా చాపమీద వాలిపోయాడు శ్రీనివాస్. వళ్లంతా నొప్పులు. కాళ్లు ఒకటే గుంజటం. కొంత సేపటికి ఇద్దరు వ్యక్తులు అక్కడికొచ్చారు. ఆ ఇద్దరూ గ్రామపెద్దలని పరిచయం చేశాడు సాహు. బోండా భాషలో తన గురించే వారికి చెప్తున్నట్లు గ్రహించాడు.

అంతలో బయట పెద్దగా అరుపులు. గిరిజ నులు గుంపులుగా గుమికూడారు. గ్రామపెద్దలు హడా విడి పడ్తూ బయటికెళ్లారు. శ్రీనివాస్ కూడా సాహుని అనుసరించాడు. ఒక యువకుణ్ణి ఒకతను చావగొడ్తు న్నాడు. వాళ్లిద్దరూ తండ్రీ కొడుకులని తెలిసింది. పెద్ద తనిలో ఆ యువకుణ్ణి చంపుదామన్నంత కోపం కనిపి స్తోంది. యువకుడు లబోదిబోమని ఏడుస్తున్నాడు. ఒక గ్రామపెద్ద కలగజేసుకున్నాడు. అయినా తండ్రి వెనక డుగు వెయ్యటం లేదు. సాహు ముందుకొచ్చి అడ్డు పడటంతో తండ్రి వెనక్కు తగ్గాడు. సాహు అతన్ని మంద లిస్తున్నట్లు గ్రహించాడు. కొద్దిసేపట్లో ఎక్కడి వాళ్లక్కడ సర్దుకున్నారు.

గొడవకు కారణం ఏమంటే, తండ్రి తయారు చేసిన జీలుగుకల్లును కొడుకు తాగటానికి ప్రయత్నిం చాడు. అదే అతను చేసిన తప్పు. ఒకరు తయారుచేసిన కల్లు మరొకరు అంటుకోవటానికి వీల్లేదు. ఇలాంటి విషయాల్లో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములన్న విచక్షణ లేదు. ఎంత ఆత్మీయంగా మెసలుతుంటారో, అంత శత్రువుల్లా తలపడుతుంటారు.

ఇద్దరూ వారంపైగానే బోండా హిల్స్ మొత్తం చుట్టబెట్టేశారు. గిరిజన ప్రాంతపు పెద్దల్ని శ్రీనివాస్‌కు పరిచయం చేశాడు. అతనొక చరిత్ర పరిశోధకుడని, గిరిజన జీవితాలను అధ్యయనం చెయ్యటానికి వచ్చా డని, సహకరించవలసిందిగా అభ్యర్థించాడు. సాహు మాటలకు వాళ్లు బాగానే ప్రతిస్పందించారు.

బోండాలు కష్టజీవులు. వరి, సజ్జ, రాగులు, జొన్న పంటలు, రకరకాల కాయగూరలు పండిస్తారు. ఆహార పదార్థాల కొరతనేది వారికి తెలియదు. నాగరిక పద్ధతుల్ని కొంతవరకు అనుసరించటం నేర్చుకున్నారు. ఆ కొండల మీద మొత్తం బోండా గిరిజనులు ఆరువేల జనాభా వరకుంటారని సాహు చెప్పాడు. ప్రభుత్వం గిరి జనుల చదువు కోసం, సౌకర్యాలు ఏర్పరచటం కోసం

ప్రత్యేకించి శ్రద్ధ కనబరుస్తున్నట్లు శ్రీనివాస్ గ్రహించ గలిగాడు.

ఆ తర్వాత శ్రీనివాస్ మరో మూడుసార్లు బోండా హిల్స్‌కు రావటం జరిగింది. సాహుతో ఒకసారి కలసి వస్తే, రెండుసార్లు ఒంటరిగానే అక్కడికి వచ్చాడు. అయితే బోండాల భాష తెలిసిన ఒక గైడ్‌ను సాహు సహ కారంతో ఏర్పాటు చేసుకోగలిగాడు. వాళ్ల ఆచార వ్యవహారాలు, మంచిచెడ్డలు బాగా తెలిసిన వ్యక్తిగా శ్రీనివాస్‌కు బాగా సహకరించాడు.

బోండాలు నలభై కుటుంబాలు కలిసి ఒక కొండ మీద నివసిస్తుంటారు. పరిమితికి మించి కుటుంబాలు పెరిగే పక్షంలో అలాంటి వారిని కలిపి మరొక కొండ మీద నివాసం ఏర్పరుస్తారు. రోజూ వండుకునే పనుం డదు. ఒక్కో కుటుంబం వాళ్లు ఒక్కోరోజు నలభై కుటుం బాలకు వంటచేసి ఇంటింటికి పంచి పెడ్తారు. అంటే ఈరోజు వంట చేసిపెట్టిన కుటుంబం వంతు మళ్లీ నలభై రోజులకు వస్తుంది. వేటాడిన జంతుమాంసం తింటారు. జీలుగకల్లు బాగా ఇష్టపడి తాగుతుంటారు.

ఒకే కొండ మీదున్న యువతీయువకులు పెళ్లి చేసుకోరు. ఏదో ఒక కొండ మీదున్న యువతిని తీసు కొచ్చి, ఆ యువకుడు ఒక రాత్రి రహస్యంగా గడపాలి. అప్పుడే ఆ ఇద్దరికీ ఇరుపక్షాలవాళ్లు కలిసి పెండ్లి చేస్తారు. విందులు వినోదాలంతా మగపెళ్లివాళ్లే ఏర్పాటుచెయ్యాలి. పెళ్లాడదలచిన యువకుడు భార్యను పోషించగలడన్న నమ్మకం కలిగించాలి.

బోండాల జీవిత విధానానికి సంబంధించిన అనేక విషయాలను తెలుసుకోగలిగాడు శ్రీనివాస్. ఆ విషయాలను ఎప్పటికప్పుడు నోట్సుగా రాసుకుంటు న్నాడు. ఇక మిగిలిందల్లా వాళ్ల లైఫ్‌స్టైల్‌ను ఎలా ఫొటోగ్రఫీ చెయ్యటమన్నదే! హిల్స్ మీద అడుగడు గునా, 'ఫొటోగ్రఫీ ఈజ్ ప్రొహిబిటెడ్,' అని రాసున్న హెచ్చరికలు మనసుకు కళ్లెం వేస్తున్నాయి. సాహు మనిషిగా అందరిచేత ఒక ముద్ర వేయించుకోగలిగాడు. అనుకొన్న గోల్‌ను రీచ్ కావడానికి తగిన పథక రచన చేయటంలో నిమగ్నమయ్యాడు శ్రీనివాస్. చివరికో వ్యూహం మనసులో మెదిలింది.

శ్రీనివాస్ నాలుగోసారి వచ్చినప్పుడు వట్టి చేతుల్తో రాలేదు. గతంలో గిరిజన ప్రాంతాల్లో తీసిన వివిధ ఫొటో ఆల్బమ్‌లు తీసుకొచ్చాడు. వాటితో పాటు పోలరాయిడ్ ఇన్‌స్టంట్ కెమెరా కూడా తెచ్చాడు. ఫొటో ఆల్బమ్స్ గిరిజనులకు చూపించటం మొదలెట్టాడు. వాళ్లు ఆ ఫొటోలు ఆసక్తిగా ఎగబడి చూస్తూ తమలో తాము చర్చించుకోసాగారు. ఎవరైనా అలా ఫొటోలు తీసుకోవటం సహజమనీ, దానివల్ల ఎలాంటి అనర్థా లుండవనీ బోండాలు గ్రహించాలన్నది శ్రీనివాస్ ఉద్దేశం.

ఇంచుమించు తమను పోలివున్న గిరిజనుల ముఖ కవళికలు, వస్త్రధారణ, ఆభరణాలు విచిత్రంగా చూస్తున్నారు. ఏదో చెప్పుకుంటూ సంబరపడిపోతు న్నారు. శ్రీనివాస్ మెల్లగా వారితో మాటలు కలిపాడు. అందులో ఎవరైనా ఇష్టపడితే అలా ఫొటో తీసి చూపిస్తా నంటూ గైడ్ ద్వారా కమ్యూనికేట్ చేశాడు. వాళ్లు ముఖ ముఖాలు చూసుకుంటున్నారు. ఏదో వాదించుకుంటు న్నారు. ఒక యువకుడు అందుకు సిద్ధపడ్డాడు. ఆ అవ కాశం కోసమే శ్రీనివాస్ సిద్ధంగా వుంది. కెమెరా బయ టకు తీసి క్షణాల్లో అతన్ని ఫొటోతీసి ప్రింట్ చేతిలో పెట్టాడు. ఆ యువకుడి ముఖంలో అంతులేని ఆనం దాశ్చర్యాలు. ఒకరి చేతుల్లోంచి మరొకరు లాక్కుంటూ ఆ ఫొటో ఎగబడి చూస్తున్నారు.

తన సాహసానికి తగిన ప్రతిఫలం లభిస్తుందన్న నమ్మకం కలిగింది శ్రీనివాస్‌కు. గైడ్ ద్వారా వాళ్ల రియా క్షన్స్ తెలుసుకున్నాడు. రెస్పాన్స్ పాజిటివ్‌గా వుండటం శ్రీనివాస్‌ను ఇంకా ఉత్సాహపరిచింది. ఆ యువకుడి ఇల్లు, ఇంటి పరిసరాలు, వస్తువులు, పశువులు మొద లైన ఫొటోలు మరికొన్ని చకచకా తీసి అతని చేతిలో పెట్టాడు. అతను వాటిని సరిపోల్చుకుంటూ అందరికీ చూపిస్తూ, సంతోషంతో పొంగిపోతున్నాడు. తన వ్యూహం ఫలిస్తున్నట్లనిపించింది శ్రీనివాస్‌కు. ఫొటోలు తీసుకోవడం ఒక ఆటలాంటిదని, అందువలన ఎలాంటి కీడు జరగదని, తరతరాలు భద్ర పరుచుకో వచ్చని గైడ్ ద్వారా వాళ్లందరికీ చెప్పించాడు. ఫొటోలు తీయించుకున్న ఆ యువకుడికి పది రూపాయలు బహుమతిగా ఇవ్వటం బాగా సంతోషం కలిగించింది.

శ్రీనివాస్ మరో రెండు రోజులపాటు వున్నాడు. ఆ గిరిజన యువకుడు తీయించుకున్న ఫొటోలకు మంచి ప్రచారం వచ్చేసింది. అదో గొప్పగా తోటి గిరిజను లకు చూపించటం మొదలెట్టాడు. పెద్దలు, పిన్నలంతా వింతగా ఎగబడి చూశారు. అది చూసి స్ఫూర్తి పొందిన పిల్లముఠా ఒకటి ఫొటోలు తియ్యమని అడిగిందే తడవుగా తీసి ప్రింట్ చేతికిచ్చాడు. వాళ్ల సంతోషం అంతా ఇంతా కాదు. అది చూసి మరో ముసలివాడు ఫొటో కోసం వచ్చాడు. ఫొటోతో పది రూపాయలు బహుమతి ఇచ్చాడు.

"కంగ్రాట్స్! బోండా గిరిజనుల్ని ఫొటోతీసి ప్రాణాలతో బ్రతికున్న మొదటి వ్యక్తివి నువ్వే," విషయం సాహు దాకా వెళ్లి అభినందించాడు.

"నా సక్సెస్ వెనుక మీ అండదండలున్నాయి. నిజానికి ఇదొక చిన్న ప్రారంభం సర్! ఇంకా చెయ్యాల్సింది చాలా మిగిలుంది," చెప్పాడు శ్రీనివాస్.

"ఇట్సాల్‌రైట్. సరైన దారిని పట్టుకోగలిగిన వాడు ఎంత దూరమైనా ప్రయాణం చెయ్యగలడు. ఐయామ్ బ్లెస్సింగ్ యు." ఆ మాటలకు శ్రీనివాస్‌కు కొండంత బలం వచ్చినట్లనిపించింది.

శ్రీనివాస్ రెండు నెలల తర్వాత తిరిగి ప్రయాణానికి ముహూర్తం పెట్టాడు. ఈసారి ఒంటరిగా కాదు, మరో వీడియోగ్రాఫర్‌తో. ఏకంగా రెండు వారాలు ప్రోగ్రాం పెట్టాడు. సాహుకి ఫోన్‌లో విషయాలన్నీ చెప్పాడు.

"మరీ సాహసిస్తున్నావేమో! వాళ్లు ఏ క్షణంలో ఎలా రియాక్టవుతారో చెప్పలేం. వాళ్లతో వ్యవహారం కత్తిమీద సాములాంటిదని గుర్తుంచుకో. నీపట్ల వాళ్లకు సదభిప్రాయం వుండటం మంచి ప్లస్ పాయింట్. గో అహెడ్, బెస్టాఫ్ లక్." సాహు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది.

విజయవాడ నుండి సుమోలో బయల్దేరారు శ్రీనివాస్, వీడియోగ్రాఫర్ కొండలు. పిల్లలకోసం రకరకాల రెడిమేడ్ దుస్తులు, ఆటబొమ్మలు, చాకోబార్‌లు, బిస్కట్లు వగైరా చాలా కొన్నాడు. టవల్స్, దుప్పట్లు కొన్ని తీసుకున్నాడు. ఉదయం ఆరుగంటలకు ప్రయాణం మొదలైంది. భద్రాచలం, అక్కడ నుండి ఛత్తీస్‌గఢ్ బోర్డరు కుంట గ్రామం చేరేసరికి సూర్యాస్తమయం అయింది. రాత్రి అక్కడే మకాం.

ఉదయం తిరిగి ప్రయాణం మొదలైంది. మల్కన్‌గిరి మీదుగా ఒరిస్సాలోకి ఎంటరై సాయంత్రానికి కోరాపుట్ జిల్లా దాటి కైరాపుట్ గ్రామం చేరుకున్నారు. రాత్రి మకాం చేసి ఉదయమే బోండాహిల్స్‌కు బయల్దేరాలి. ముందే ఇన్‌ఫామ్ చేసి ఉండటంతో గైడ్ సిద్ధంగా ఉన్నాడు. రెండు రోజులు కారు ప్రయాణంతో వళ్లంతా హూనమైనట్లనిపించింది. పైకి సామాను మోసి తెచ్చేందుకు ఇద్దరు గిరిజనుల్ని గైడ్ ఏర్పాటుచేశాడు.

చీకటి ముఖానే లేచి ప్రయాణానికి సిద్ధమయ్యారు. నికాన్ కెమెరా, లెన్స్‌లు, రిఫ్లక్టర్స్ మొత్తం ముప్పైకిలోల బరువుతో కొండల మీదకు వెళ్లటం చాలా కష్టంతో కూడుకున్న పని అయినా తప్పదు. సూర్యోదయ సమయంలో ప్రకృతి దృశ్యాలను తను ఫొటోలు తీస్తుంటే, కొండలు వీడియో తీస్తూ శ్రీనివాస్‌ను ఫాలో అవుతున్నాడు. సంతకు వెళ్తొన్న బొండాలు గుంపుగా గుంపులుగా కొండ దిగివస్తున్నారు.

'హాసన్నా,' అంటూ శ్రీనివాస్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ చకచకా క్రిందకు వెళ్తున్నారు. వాళ్లను ఆపి రకరకాలుగా ఫొటోలు తీస్తున్నాడు. కొండ దారిలో కనిపించిన గిరిజనుల్ని, ప్రకృతి దృశ్యాలను ఫొటోలు తీసుకుంటూ పైకి చేరేసరికి సూర్యాస్త మయం కావచ్చింది. ఇద్దరూ బాగా అలసిపోయారు. బడి పిల్లల హాస్టల్‌లోనే రాత్రికి బస ఏర్పాటు చేసుకున్నారు.

ఉదయం ముందుగా బోండా పెద్దల్ని కలిశాడు. రకరకాల బహుమతులు ఇచ్చి వాళ్లను ఆనందపరిచాడు. రెండు వారాల టైమ్‌ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్లాను చేసుకున్నాడు. బోండాహిల్స్ మొత్తం కవర్ చెయ్యాలి. బోండా గిరిజనుల జీవనశైలిని సహజ సుందరంగా చిత్రించాలి. వారి జీవనశైలిని ప్రపంచానికి వెల్లడించిన తొలి ఫొటోగ్రాఫర్ తను కావాలి. నిమిషం వృథా కాకూడదనుకున్నాడు. కొండ కోనల్లో జీవిస్తూ, తమకంటూ ఒక భాష, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, సంస్కృతిని ప్రదర్శిస్తున్న బోండా గిరిజనుల అస్తిత్వాన్ని భవిష్యత్తు తరాలకు కళాత్మకంగా ఛాయాచిత్రాల రూపంలో భద్రపరచి అందించబోతున్నానన్న ఆనందమే శ్రీనివాస్‌కు వేయి ఏనుగుల బలాన్నిచ్చింది.

ఆడవారు పిల్లల్ని వీపులమీద మోస్తూ కుండలతో నీళ్లు తెచ్చుకోవటం, కసువులూడుస్తూ ఇల్లు, పరిసరాల్ని శుభ్రం చేసుకోవటం, పిల్లల ఆలనాపాలనా చూడటం, చెక్క తిరగళ్లతో రాగులు, సజ్జలు విసరడం, రోకళ్లతో దంచటం, మగవాళ్ల పశుపోషణ, వ్యవసాయ పనులు ఇలా ప్రతిదీ ఫొటోలు తీసుకోవటం అతని నిత్యకృత్యమైంది. పిల్లల ఆటలు, వివిధ సందర్భాల్లో వేడుకగా చేసే గిరిజన నృత్యాలు ఏర్పాటు చేయించుకొని మరీ చిత్రించగలిగాడు.

ఒకరోజు రాత్రి మంచి నిద్రలో వుండగా శ్రీనివాస్‌ని నిద్రలేపాడు కొండలు. కాస్త దగ్గరలో ఒక స్త్రీ ఆర్తనాదం వుండుండి వినిపిస్తోంది. కారణం ఏమిటనేది తనకు మాత్రం ఏం తెలుసు? తమ మాటలకు గైడ్‌కు మెలకువ వచ్చింది. అతన్నడిగాడు కొండలు. అదేమంత కంగారుపడాల్సిన విషయం కాదన్నట్లు తేలిగ్గా తీసుకున్నాడతను.

"ఒక స్త్రీ బిడ్డను కనేందుకు పురిటి నొప్పులు పడుతుంది," గైడ్ ఆవలించాడు మత్తుగా.

"ఇక్కడ డాక్టరుగాని, హాస్పిటల్ సౌకర్యాలుగాని ఏమీ వున్నట్లులేదే!" అడిగాడు శ్రీనివాస్.

"ప్రత్యేకించి డాక్టర్ని పిలిపించటం, హాస్పిటల్‌కు తీసుకెళ్లటం లాంటి జాగ్రత్తలు పాటించరు," అంటూ కొన్ని వివరాలు చెప్పాడతను.

కొండమీదనే స్త్రీల ప్రసవానికి ఒక ఇల్లుంటుంది. ప్రసవించే రోజులు దగ్గర పడినప్పుడు ఆ ఇంటిని శుభ్రం చేసి పెడతారు. నొప్పులు మొదలయ్యాక ఆ స్త్రీని ఒంటరిగానే లోపలకు పంపిస్తారు. తోడుకుగాని, సహాయపడటానికిగాని మరొకరు అందుబాటులో వుండరు. బిడ్డను కన్న స్త్రీ తనకుతానుగా ఆ బిడ్డను ఎత్తుకొని బయటకు రావాల్సిందే! బిడ్డను కనలేక తల్లి చనిపోయినా, అనారోగ్య పరిస్థితుల్లో బిడ్డ చనిపోయినా అంతగా దుఃఖపడరు.

ఒక స్త్రీ మరో జీవికి ప్రాణం పొయ్యటానికి తన ప్రాణాన్ని ఒడ్డాల్సిందే. అందుకే స్త్రీకి మాతృత్వం మరో జన్మలాంటిదంటారు. అలాంటిది ఏ ఒక్కరి సహాయం లేకుండా ఆమె కర్మానికి ఆమెను వదిలిపెట్టడం దారుణమనిపించింది. మానవజాతి శాస్త్రీయంగా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఇంకా కొందరు మనుషులు ఇంత అనాగరికంగా, అశాస్త్రీయంగా బ్రతకటం ఏమిటి?

ఈ సభ్య ప్రపంచం నుంచి అమాయకులైన ఈ గిరిజనులు నాగరికత, మూఢాచారాలకు భిన్నంగా హేతుబద్ధమైన ఆలోచనా విధానం, నేర్చుకోవాల్సి వుందనిపించింది శ్రీనివాస్‌కి. ఆ స్త్రీ క్షేమంగా బిడ్డను ప్రసవించిందని తెలుసుకున్నాకగాని అతని మనసు కుదుటపడలేదు.

మజిలీలో చివరిరోజు. కాలకృత్యాలు తీర్చుకొని సరంజామాతో సిద్ధమయ్యాడు. ఆరోజు కొండ చరియల్లోకి వెళ్లి గిరిజనులు వ్యవసాయ పద్ధతుల్ని ప్రత్యేకించి చిత్రీకరించాలని ప్లాన్ చేసుకున్నాడు. ఇంతవరకు అనుకున్నది అనుకొన్నట్లుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా ఒక క్రమపద్ధతిలోనే జరిగిందన్న సంతృప్తి కలిగింది. వసతి నుంచి బయటపడేసరికి ఇంకా తెల్లవారనేలేదు. అందరికంటే ముందు వేగంగా నడుస్తున్నాడు.

శ్రీనివాస్ తొలిసంధ్య వెలుగుల్లో ప్రకృతి రమణీయతను కెమెరాతో బంధిస్తూ ఆ తన్మయత్వంలో పరిసరాల్నే మరచిపోయాడు. గుట్టల మీదుగా పైకి ఎక్కుతూ కిందకు జారుతూ మిత్రబృందం నుంచి వేరుబడి కనుమరుగయ్యాడు. అప్పటికే గిరిజనులు పొలం పనుల్లో తలమునకలుగా కనిపిస్తున్నారు.

శ్రీనివాస్‌ని ఒక దృశ్యం మంత్రముగ్ధుణ్ణి చేసి ఆకట్టుకొంది. ఒక గిరిజన రైతు చిన్న మట్టిదిబ్బ మీద ఒంటరిగా నిలబడి ధాన్యం తూర్పారబడుతున్నాడు. అతని వెనుక నుంచి ప్రసరిస్తున్న లేలేత సూర్యకిరణాల వెలుగులో, సన్నటి ధారగా పడుతున్న ధాన్యం గింజలు పసిడివర్ణంలో కాంతులీనుతూ ఒక కమనీయ దృశ్యం రూపొందింది. కొద్ది క్షణాల ఆలస్యం చాలు ఆ దృశ్యం చేజారటానికి. శ్రీనివాస్ గుట్టల మీద నుంచి జర్రున జారి క్షణాల్లో పొలంలోకి అడుగుపెట్టాడు. మెరుపు వేగంతో అటూ ఇటూ కదుల్తూ కెమెరా యాంగిల్ చూస్తూ, జూమ్ లెంగ్త్ ఎడ్జస్ట్ చేసుకుంటూ క్లిక్ క్లిక్ క్లిక్ మనిపిస్తున్నాడు.

తూర్పార బడుతున్న ఆ రైతు యథాలాపంగా శ్రీనివాస్‌ని గమనిస్తూ ఒక్కసారి మహోగ్రరూపం ధరించాడు. పట్టరాని కోపంతో పళ్లు కొరుకుతూ, దిబ్బ మీద నుంచి సింహంలా కిందకు దూకాడు. తీవ్రస్వరంతో అరుస్తూ చెట్టుకొమ్మకు వేలాడదీసిన విల్లు చేతబట్టి, అంబుల పొది నుంచి సర్రున బాణం తీశాడు. క్షణాల్లో విల్లు శ్రీనివాస్ గుండెలకేసి ఎక్కుపెట్టి నారి సారించాడు.

శ్రీనివాస్ భయంతో బిగుసుకుపోయాడు. ఆ విల్లంబు గుండెలో దిగటానికి ఒక్కక్షణం చాలు. ఆ రైతు కళ్లు ఎర్రబారి నిప్పులు కక్కుతున్నట్లున్నాయి. కంఠనాళాలు ఉబికాయి. తనవల్ల అంత తప్పేంజరిగిందో అర్థంకాలేదు. అతనికడ్డు చెప్పేవాళ్లుగాని, తన ప్రాణాన్ని కాపాడగలిగే వాళ్లుగాని అక్కడెవరూలేరు. తన జీవితానికి అవే ఆఖరి క్షణాలనుకున్నాడు. దిగచెమటలతో శరీరం కంపించసాగింది. రెండు నిమిషాలు కాలం స్తంభించినట్లయింది.

ఉన్నట్లుండి ఆ రైతు ముఖకవళికల్లో మెల్లగా మార్పొచ్చింది. సారించిన విల్లు కిందకు దించాడు. ఆవేశాన్ని అదుపు చేసుకొని, యథాస్థానంలో ఆ విల్లం బుల్ని వుంచాడు. కాని కోపం మాత్రం పూర్తిగా తగ్గలేదు. పెద్దగా ఏదో అరుస్తూ శ్రీనివాస్‌ని అక్కడే కూర్చోమని సైగలు చేశాడు. శ్రీనివాస్ అలానే క్రింద కూర్చున్నాడు. అతను అనర్గళంగా ఏవో అర్థంకాని పదాలను ఉచ్చరిస్తూ శ్రీనివాస్ చుట్టూ తిరుగుతున్నాడు. గడ్డిపరకల్ని చేత్తో తుంపులు తుంపులు చేస్తూ శ్రీనివాస్ చుట్టూ విసుర్తున్నాడు. శ్రీనివాస్ ఏ మాత్రం కదలకుండా బండరాయిలా కూర్చున్నాడు.

కాసేపటికి తనను గాలిస్తూ మిత్రబృందం అక్కడికి రావటం గమనించి శ్రీనివాస్ ధైర్యం కూడ గట్టుకొన్నాడు. ఏదోరకంగా తనను ఈ ప్రమాదం నుంచి తప్పించగలరన్న నమ్మకం కలిగింది. వాళ్లు దూరంగా నిలబడి గుడ్లప్పగించి చూస్తున్నారుగాని దగ్గరకు రావటానికి సాహసించటం లేదు.

"శ్రీనివాస్ మీరు లేవకండి. అతని పూజ పూర్తయ్యేదాకా కదలకుండా వుంటే ఏం ప్రమాదం ఉండదు. అవివేకంతో ప్రాణాల మీదకు తెచ్చుకోకండి," హెచ్చరికగా అరిచి చెప్పాడు గైడ్.

పైన ఎండమాడుతోంది. గంటలు భారంగా గడుస్తున్నాయి. శ్రీనివాస్‌కి దాహంతో గొంతెండిపోతున్నది. ఆకలి దహించివేస్తోంది. అతను మాత్రం దీక్షగా, ఏకాగ్రతతో పూజ చేస్తూనే ఉన్నాడు. అక్కణ్ణుంచి తను కదలడంలేదు. శ్రీనివాస్ కదిలే అవకాశం ఇవ్వడంలేదు.

సూర్యాస్తమయ సమయానికి అతని పూజ పూర్తయింది. భూమికి తలానించి మొక్కాడు. కళ్లకద్దుకున్నాడు. మట్టిని చేతికద్దుకొని వంటికి విబూదిలా రాసుకున్నాడు. నొసట మీద దిద్దుకున్నాడు. నలుదిక్కులా చేతులు జోడించాడు. అప్పుడు శ్రీనివాస్‌ని లెమ్మంటూ సైగచేశాడు. తిండీతిప్పలు లేకుండా గంటల తరబడి ఎండలో కూర్చున్నాడేమో శ్రీనివాస్ లేచి సరిగా నిలబడలేకపోయాడు. కళ్లు తిరుగుతున్నట్లనిపించింది. కొండలు, గైడ్ పరుగున దగ్గరకు వచ్చారు. కొంచెంగా నీళ్లు తాగించారు. తినేందుకు బిస్కట్లు చేతిలో పెట్టారు.

గైడ్ గిరిజనుడితో మాట్లాడాడు. కాసేపు గడగడా ఏదో మాట్లాడి వెనుదిరిగి వెళ్లి, తన పని తాను చేసుకో సాగాడు. శ్రీనివాస్‌కి కాస్త ఓపిక వచ్చింది. ప్రాణం తెప్పరిల్లుకొంది. తనవల్ల జరిగిన తప్పేంటో చెప్పమని గైడ్‌నడిగాడు.

పంటభూమిలోకి శ్రీనివాస్ బూటు కాళ్లతో అడుగుపెట్టి, భూమిని అపవిత్రం చేసినట్లుగా భావించి ఆ గిరిజన రైతు సహించలేకపోయాడు.

"అతను చేసిన తెలివితక్కువ పని వలన కొంత కాలం నా భూమి పండదు. అలాంటప్పుడు నేనూ, నా బిడ్డలూ ఏం తింటాం? ఎలా బతకగలం? భూమి తల్లిని అపవిత్రం చేసిన నేరానికి అతన్ని చంపేద్దాం అన్నంత కోపం వచ్చింది. అతన్ని చంపితే సాహు మనసు బాధపడుతుందని చంపకుండా వదిలిపెట్టాను. ఆ దేవత కరుణించేదాకా మాకు పస్తులు తప్పవు." ఆ రైతు మాటల్ని యథాతథంగా అతనిమాటల్లోనే గైడ్ చెప్పాడు.

ఆ మాటలతో శ్రీనివాస్‌కు ఆ గిరిజనుడి పట్ల అమితమైన గౌరవం కలిగింది. తినేందుకు పట్టెడు తిండిగింజలు పండించి పెడుతున్న భూమి పట్ల, అనాగరికుడుగా చిన్నచూపు చూడబడుతున్న ఒక గిరిజనుడికి ఎంత ఆరాధనాభావం వుందో అర్థమై, మనసు ఆర్ద్రమైంది. కళ్లు సజలమైనాయి.

నాగరికులనుకున్న వాళ్లు ఎంతగా పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారో, మానవాళి మనుగడకు ముప్పుతెస్తున్నారో తలచుకొంటే, ఎవరు ఎవరి నుంచి నేర్చుకోవాల్సింది వుందో బోధపడినట్లయింది.

"ఏమండీ! మీ కోసం మీడియా వాళ్లనుకుంటా కవరేజికి వచ్చినట్లుంది," భార్గవి పిలుపుకు గతం తాలూకు ఆలోచనల నుంచి ఈ లోకంలో పడ్డాడు శ్రీనివాస్.

బయటకు అడుగుపెట్టటంతోటే మీడియా వాళ్లు అభినందిస్తూ, గిరిజనులతో మీ అనుభవాలు చెప్పండంటూ రకరకాల ప్రశ్నలడగటం మొదలెట్టారు. వాళ్లు అడిగినా, అడగకపోయినా ఈ అవార్డు పొందటం ద్వారా నాగరిక ప్రపంచానికి ఇవ్వాల్సిన ముఖ్య సందేశం ఏమిటనేది శ్రీనివాస్ ఎప్పుడో నిర్ణయించుకున్నాడు.

*స్వాతి వారపత్రిక, 10 జూన్ 2011*

